క్లుప్తంగా

అన్ని విధాలుగా అండగా రాష్ట్ర ప్రభుత్వం

పొన్నూరు ఎమ్మెల్యే వెంకట రోశయ్య

పొన్నూరు: తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మంగళవారం వర్షాల కారణంగా నియోజక వర్గంలో నెలకొన్న పరిస్థితులపై ఆయన అధికారులతో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. వరి కోతలు వాయిదా వేసుకోవాలని కోరారు. తేమ వున్న ధాన్యమైనా రంగుమారిన ధాన్యమైనా యుద్ధ ప్రాతిపదికన ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు అధైర్యపడాల్సిన అవసరం ఉండదని వెల్లడించారు. మురుగు కాలువల్లో వ్యర్థాలు లేకుండా యంత్రాలతో తొలగించాలన్నారు. తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు. సురక్షిత ప్రాంతాలకు తరలించిన వారితో పాటు ఇళ్లలోకి నీరు చేరిన వారికి 25 కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందించాలని అధికారులను ఆదేశించారు.

జీజీహెచ్ శానిటేషన్ సంస్థకు నోటీసులు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో శానిటేషన్ కాంట్రాక్టు నిర్వహణ బాధ్యత చేపట్టిన ఏజెల్ సంస్థకు నోటీసులు జారీ చేసినట్లు జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. క్యాజువాల్టీలో మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అపరిశుభ్రంగా ఉండటంతో పారిశుద్ధ్య సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ 240 మంది పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో ఉండాల్సి ఉండగా, కేవలం 170 మంది మాత్రమే పని చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్మికులకు క్లీనింగ్‌కు ఆధునిక పరికరాలు ఇవ్వకుండా పురాతన పద్ధతుల్లో క్లీనింగ్ పనులు చేయిస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని, తూతూ మంత్రంగా వారు విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈనేపథ్యంలో శానిటేషన్ కాంట్రాక్టు సంస్థకు నోటీసులు జారీ చేశామన్నారు. తనిఖీల్లో డెప్యూటీ డీఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్, డెప్యూటీ సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ యూనీస్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశ సజని పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

లక్ష్మీపురం: గుంటూరు శ్యామలానగర్ గేటు వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపిన వివరాలు.. శ్యామలానగర్ రైల్వే గేటు వద్ద గుర్తు తెలియని వ్యక్తి (45) రైలు పట్టాలపై పడి ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆర్పీఎఫ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చుట్టు పక్కల వారిని విచారించడం జరిగిందని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తిగా విచారణలో తెలడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ సమగ్రాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఆర్పీఎఫ్ సీఐ గంగా వెంకటేశ్వర్లు 9440627546 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వివాహిత హత్య కేసులో నిందితుడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాసరావు, ముసుగులో నిందితుడు

పట్నంబజారు: వివాహిత హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో సీఐ ఎం.శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఈనెల 1న సంపత్‌నగర్ 6వలైనులో షేక్ హసీనా అలియాస్ బాజి(39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. భర్త హుస్సేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సంపత్‌నగర్‌కు చెందిన షేక్ సైదా అలియాస్ అల్లల్లతో వివాహేతర సంబంధం ఉంది. గతకొంతకాలంలో మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటుందని గుర్తించిన సైదా వారించాడు. ఈవిషయంలో బాజీ, సైదా మధ్య ఘర్షణ జరిగింది. ఈనెల 1న మిర్చి యార్డులో కూలికి వెళ్లిన బాజి సాయంత్రం అయినప్పటికీ ఇంటికి రాలేదు. అనుమానం వచ్చిన భర్త హుస్సేన్ పనికి వెళ్లే దుకాణానికి ఫోన్ చేయడంతో అప్పటికే బాజీ వెళ్లినట్లు వారు తెలిపారు. సైదాతో వివాహేతర సంబంధం ఉన్న విషయం అప్పటికే తెలిసిన హుస్సేన్ సంపత్‌నగర్‌లోని సైదా నివాసానికి వెళ్లాడు. బాజీ మృతిచెంది ఉండటం గమనించాడు. మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటున్న కారణంతో వివాహేతర సంబంధం పెట్టుకున్న సైదా గొంతునులిమి బాజీని హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు.

తుఫాన్ ప్రభావం రైతులపై అధికం

- నీట మునిగిన వరి పంట
- ఒరిగిన చెట్లు..
- విరిగిన విద్యుత్ స్తంభాలు



మన్నవ గ్రామంలో నీట మునిగిన వరి పంట



నల్లమడ వాగు కట్ట వద్ద వరద బాధితులను తరలిస్తున్న తహసీల్దార్ సుభాని



ప్రత్తిపాడు- గొట్టిపాడు లోలెవల్ చప్టాపై ఎస్ఐ రవీంద్ర పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు



జలమయమైన ప్రత్తిపాడు బస్టాండు మార్గం



కాకుమాను- చినకాకుమాను మధ్య నేలకొరిగిన భారీ వృక్షం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే సుచరిత

గుంటూరు రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అందరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే ప్రజలు బయటకు రావాలని సూచించారు. రైతులు ఎప్పటికప్పుడు అధికారుల సూచనలు పాటించాలని సూచించారు. రైతులకు ప్రజలకు సహకారం అందించే దిశగా జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. వాగులు, కాలువలు, చెరువుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పొన్నూరు: మిచాంగ్ తుఫాన్, వరి పంట రైతులను నట్టేట ముంచింది. పొన్నూరు మండలంలో సుమారు 26,700 ఎకరాల్లో వరిపంట సాగు చేయగా సుమారు పది వేల ఎకరాలు నీట మునిగినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. పొన్నూరులో జోరుగా వర్షం కురుస్తుండటంతో జన జీవనం, రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈదురుగాలులకు పట్టణంలోని 26వ వార్డులో భారీ చెట్టు నేల కొరిగింది. నివాసప్రాంతమైన మార్గం కావడంతో ప్రజల రాకపోకలు స్తంభించాయి. 25 వార్డులోని ఎస్టీ కాలనీలో ప్రధాన డ్రైనేజీ పొంగిపార్లడంతో ముందస్తు జాగ్రత్తచర్యల్లో భాగంగా అధికారులు కాలువ వెంబడి నివాసితులను ఖాళీ చేయించి ప్రభుత్వ పాఠశాలకు తరలించి సహాయక చర్యలు చేపట్టారు. వర్షం ఈదురు గాలులతో పట్టణంలోని ఇటుకంపాడు, అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో మూడు భారీ చెట్లు ఒరిగి విద్యుత్ స్తంభాలపై పడ్డాయి. దీంతో స్థానికంగా విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో అధికారులు వెంటనే స్పందించి విద్యుత్‌ను వేరే లైను ద్వారా పునరుద్ధరించారు.

ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పర్యటన

వర్ష ప్రభావిత ప్రాంతమైన పొన్నూరు పట్టణ, రూరల్లో గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పర్యటించారు. భారీ వర్షాలకు తీసుకోవాల్సి జాగ్రత్తలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. మండలంలోని మెయిన్ రోడ్డుపై పడిపోయిన చెట్టును ఎస్పీ పర్యవేక్షణలో పోలీసులు తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ కె.శ్రీకాంత్ తెలిపారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు

పెదనందిపాడు: నల్లమడ వాగు కట్ట వద్ద నివాసం ఉంటున్న 40 కుటుంబాలలోని 75 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. పెదనందిపాడు ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం నల్లమడ వాగు కట్ట వద్ద వరద బాధితులతో తహసీల్దార్ సుభాని మాట్లాడుతూ వర్షాలు తగ్గేంత వరకు పునరావాస కేంద్రంలో తలదాచుకోవాలని, మీకు ఏమైనా ఆరోగ్య సమస్యలున్నచో ఆరోగ్య శాఖ సిబ్బంది ఇక్కడికే వచ్చి వైద్య సేవలు అందిస్తారని హామీ ఇచ్చారు. వరద బాధితులకు భోజన సదుపాయాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ షేక్ ఖాశింపీరా సొంత ఖర్చుతో ఏర్పాటు చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ రాజగోపాల్, సర్పంచి దాసరి పద్మారావు, ఉపసర్పంచి దివ్వి రాంబాబు, పెదనందిపాడు సొసైటీ అధ్యక్షులు డి.నాగేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ రవి ఉన్నారు.

పంట నీటమునక

పెదనందిపాడు: రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు 4,900 హెక్టార్లలో పంట నీట మునిగింది. సోమ, మంగళ వారాల్లో మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాల వలన లోతట్టు ప్రాంతాలు అన్ని జలమయమయ్యాయి. నల్లమడ వాగుకు వరద ఉధృతి పెరుగుతోంది. నీట మునిగిన పంట పొలాలను ఏఓ సుధారాణి, తహసీల్దార్ సుభాని, ఎంపీడీఓ రాజగోపాల్ వివిధ శాఖల అధికారులు పరిశీలించారు. చిలకలూరిపేట రోడ్డు వద్ద మోకాళ్ల లోతులో వర్షపు నీరు ప్రవహిస్తోంది. ఈ రాత్రి కూడా వర్షాలు కురిస్తే నల్లమడ వాగుకు వరద ఉధృతి పెరుగతుందని అధికారులు తెలిపారు.

నీట మునిగిన పంట పొలాలు

కాకుమాను: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో వరి, శనగ, పొగాకు, మిర్చి పంటలు నీట మునిగాయి. మండలంలోని చిన కాకుమాను ప్రధాన రహదారిపై మంగళవారం వీచిన ఈదురుగాలులకు భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నీట మునిగిన పంట పొలాలను ఏఓ కిరణ్మయి పరిశీలించారు. మంగళవారం ఉదయం నుంచి మండలంలో సుమారు 30.5 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఎడతెరిపి లేని వాన

ప్రత్తిపాడు: బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాను ప్రభావంతో భారీ వర్షం కురిసింది. ప్రత్తిపాడు మండలంలో సోమవారం రాత్రి నుంచి మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు ఈదురు గాలులతో 75.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో పంట పొలాలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. ప్రత్తిపాడు నుంచి గొట్టిపాడు వెళ్లే దారిలో ఉన్న లోలెవల్ చప్టాపై నక్కల వాగు ఉప్పొంగడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు లోలెవల్ చప్టాలపై ప్రత్యేక పహారా నిర్వహించి రాకపోకలను నిలిపివేశారు. బస్టాండు నీటమునిగింది.



వడ్లమూడిలో లోతట్టు ప్రజలతో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కేవీ



నీటమునిగిన వెంగళయపాలెంలోని పూలే కాలనీ



పాతమల్లాయపాలెంలో నీటనానుతున్న మిరప పంట



పెదనందిపాడులో నీట మునిగిన పంట పొలాలు

నీటనానుతున్న పంట పొలాలు..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని పంటపొలాలు పూర్తిగా నీటమునిగాయి. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం, తిమ్మాపురం, వంగిపురం గ్రామాల్లోని మిర్చి పంటపొలాలు తటాకాలను తలపించాయి. మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, ఉద్యాశాఖ అధికారులు వేర్వేరుగా నీటమునిగిన పంట పొలాలను పరిశీలించారు. మిర్చి, పొగాకు, వరి సాగుచేసిన రైతులతో మాట్లాడారు. పంట నష్టం అంచనాలు వేశారు. ధైర్యంగా ఉండాలని రైతాంగానికి భరోసానిచ్చారు. నీట మునిగిన పంట అంచనాలను ప్రభుత్వానికి పంపుతామని తెలిపారు.

వెంగళయపాలెంలో లోతట్టు ప్రాంతాలు అప్రమత్తం

గుంటూరు రూరల్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం, ఈదురుగాలుల వల్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని వెంగళయాపాలెం పూలే నగర్‌లో లోతట్టు ప్రాంతం నీరు చేరి ఇళ్లలోకి రావటంతో అప్రమత్తమైన వలంటీర్లు ఉన్నతాధికారులకు సమాచారం అందించటంతో వెంటనే సుమారు 15 కుటుంబాలను గ్రామంలోని సురక్షిత ప్రాంతానికి తరలించారు.

పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

పెదకాకాని: పంట పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ నున్నా వెంకటేశ్వర్లు అన్నారు. పెదకాకాని మండలంలోని రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులకు బాగా పెరిగిన వరిపంట నేలవాలింది. 24 గంటలుగా అధిక వర్షం పడుతుండటంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. నేలవాలిన వరి పొలాలను గుంటూరు ఏడీఏ నున్నా వెంకటేశ్వర్లు, మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి రైతులతో కలసి మంగళవారం నంబూరు, ఉప్పలపాడు, గోళ్లమూడి ప్రాంతాలలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏడీఏ మాట్లాడుతూ పొలంలోకి చేరిన నీటిని వీలైనంత త్వరగా బయటకు తీయాలన్నారు. వరి గింజలు మొలకెత్తే పరిస్థితి ఉన్న చోట 5 శాతం ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ దంతాల వెంకటేశ్వరరావు, ఏఈఓ రెడ్డి శివాజీ పాల్గొన్నారు.

అన్నదాతలకు అపార నష్టం



చేబ్రోలు, మంచాల గ్రామాల్లో నేల వాలిన వరిపైరు

చేబ్రోలు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఈదురుగాలులు, భారీ వర్షంతో ప్రజలు అవస్థలు పడ్డారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడటంతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. చేబ్రోలు, నారాకోడూరు, వేజండ్ల తదితర గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా చేరటంతో వర్షపు నీరు ప్రవాహానికి ఆటంకం ఏర్పడటంతో తటాకాలను తలపించాయి. మండలంలో సాగు చేస్తున్న మాగాణి, మెట్ట, కూరగాయ రైతులకు అపారనష్టం సంభవించింది. ఖరీఫ్ సీజన్‌లో మాగాణిలో 15 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. చేబ్రోలు, మంచాల, వడ్లమూడి, నారాకోడూరు, వేజండ్ల, శలపాడు, శేకూరు తదితర గ్రామాల్లో వరి కోతల దశకు వచ్చింది. మరో వారం రోజుల పాటు వాతవరణ అనుకూలించినట్లయితే రైతుల పంట ఇంటికి చేరుకునేది. అన్నదాతలు ఆరుగాలం శ్రమించిన పంట నేలపాలవటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేబ్రోలు, మంచాల, వడ్లమూడి, నారాకోడూరు తదితర గ్రామాల్లో వరి పైరు నేల వాలింది. మునిగిన పంటపై నుంచి వర్షం నీరు ప్రవహిస్తుంది. వేలాది రూపాయిల పెట్టుబడి పెట్టి పండించిన పంట వర్షార్పణం అవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కూరగాయ తోటలు

నారాకోడూరు, గుండవరం, గొడవర్రు, చేబ్రోలు, శలపాడు, వేజండ్ల తదితర గ్రామాల్లో మెట్ట పంటలైన పత్తి, మిర్చి తోటలను సాగు చేస్తున్నారు. నారాకోడూరు, కొత్తరెడ్డిపాలెం, శలపాడు తదితర గ్రామాల్లో అపరాలైన మినుము, పెసర పంటలను సాగు చేస్తున్నారు. పూత, పిందె దశలో ఉన్న తోటలకు ప్రస్తుతం కురిసిన వర్షాలకు పొలాలు ముంపుబారిన పడ్డాయి. నారాకోడూరు, గుండవరం, వేజండ్ల, చేబ్రోలు తదితర గ్రామాల్లో దొండ, చిక్కుడు, బీర, దోస, టమోటో, కాకర, క్యాబేజి, సొర తదితర పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయ తోటలు వర్షాలకు నీటమునిగాయి.



నారాకోడూరు గ్రామంలో క్యాబేజ తోటలో నిలిచిన వర్షపు నీరు



పెదనందిపాడు సమీపంలో చిలకలూరిపేట చప్టాపై నీరు ప్రవహిస్తున్న దృశ్యం



గోళ్లమూడి శివార్లలో పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు వెంకటేశ్వర్లు, సంధ్యారాణి

పునరావాస కేంద్రాలు ఏర్పాటు



వడ్లమూడి ఎంపీపీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులు

చేబ్రోలు: తుఫాన్ ప్రబావంతో చేబ్రోలు మండలంలో మంగళవారం పలు చోట్ల భారీ వృక్షాలు నేల కూలాయి. మండల పరిధిలోని కొత్తరెడ్డిపాలెం భావనారుషి గుడి ప్రాంతంలో పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. విషయం తెలిసిన వెంటనే ఘటనా ప్రాంతానికి చేరుకున్న తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ పంచాయతీ సిబ్బంది సహకారంతో చెట్టును తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు. నారాకోడూరు, గుండవరం ప్రాంతాల్లో, శేకూరు, శలపాడు ప్రాంతాల్లో పెద్ద చెట్లు కూలిపోయాయి. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు చేబ్రోలు మండలంలోని 13 గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేసి, సరఫరా పునరుద్ధరించారు.

వడ్లమూడిలో పునరావాస కేంద్రం..

చేబ్రోలు మండలం వడ్లమూడిలో పునరావాస కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. క్రోసూరు ప్రాంతానికి చెందిన 16 కుటుంబాలకు చెందిన 40 మంది వడ్లమూడి గరువు పాలెం ప్రాంతంలో పట్టాలతో తాత్కాలిక షెడ్డులను వేసుకొని కూలిపనులతో జీవనం సాగిస్తున్నారు. తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతంలో ఉన్న వారి షెడ్డులోకి నీరు చేరింది. స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీఓ బి.బాబూరావు పరిశీలించి అత్యవసరంగా స్థానిక ఎంపీపీ స్కూల్‌లో పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేసి అక్కడకు చేర్చారు. పంచాయతీ కార్యదర్శి వైపీఏ ప్రసాద్ పునరావాస కేంద్రం వద్ద పర్యవేక్షణ చేస్తున్నారు.



పునరావాస కేంద్రంలో భోజనం అందిస్తున్న దృశ్యం

పెదకాకానిలో వంద కుటుంబాలకు పునరావాసం..

పెదకాకాని: మండలంలో తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. పెదకాకాని మండలంలో 69.4 మి.మీ. వర్షంపాతం నమోదు అయింది. పేదలు నివసించే నంబూరు యానాది కాలనీ, పెదకాకాని బాజీ నగర్‌లోని 40 ఇళ్లలో వర్షపు నీరు చేరింది. సమస్యను వలంటీర్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన గుంటూరు ఆర్డీఓ శ్రీకర్, తహసీల్దార్ నగేష్, ఎంపీడీఓలు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. తొలుత నంబూరు కాలనీలో నివసిస్తున్న సుమారు 60 కుటుంబాల వారిని స్కూల్ బస్సులో స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. అనంతరం పెదకాకాని బాజీ నగర్ ప్రాంతంలో నివసిస్తున్న గొంద్లు 40 కుటుంబాలు ఇళ్ల వర్షం నీరు చేరి చుట్టూ నీరు చేరి ఇబ్బందులు పడుతుండడంతో ఆ ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. వారితో మాట్లాడి స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి భోజన వసతులు కల్పించారు. వీరి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు జొన్నల అవినాష్ రెడ్డి, షేక్ ఆరిఫ్ ఉన్నారు.



పెదకాకాని పునరావాస కేంద్రంలో తుఫాన్ బాధితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీకార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- నగర కమిషనర్ కీర్తి చేకూరి
- అందుబాటులో కాల్ సెంటర్ 0863-2345103

నెహ్రూ నగర్: మిచాంగ్ తుఫాన్ తీరం దాటినా తీవ్రత ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షం వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా నగరపాలక సంస్థ తగిన చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీకలవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోందని, చుట్టు పక్కల నివాసితులు పిల్లలను బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పురాతన భవనాలలో నివసించే వారు వర్షం వలన గోడలు నాని కూలే ప్రమాదం ఉంటుందని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ వలన నగర పరిధిలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863-2345103 ఫోన్ చేయాలన్నారు. నగరపాలక సంస్థ నుంచి తుఫాన్ వల్ల వచ్చే సమస్యల పరిష్కారనికి 4 సీనియర్ అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, ఇప్పటికే అధికారులు, కార్యదర్శులకు సెలవులు రద్దు చేశామని తెలిపారు. గాలి తీవ్రత వలన చెట్లు కూలితే పార్క్ సిబ్బంది వెంటనే తొలగించాలని, అందుకు సంబంధించిన వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వెళితే మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని, రిజర్వాయర్లలో తాగునీటి సరఫరాకి ఏవిధమైన ఆటంకం లేకుండా పర్యవేక్షణ చేయాలని ఏఈలను ఆదేశించారు.

బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన సర్వే చేపట్టాలి

నెహ్రూ నగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని రైల్వే లెవల్ క్రాసింగ్‌ల వద్ద ఆర్ఓబీ/ ఆర్‌యూబీల నిర్మాణాల వలన చుట్టు పక్కన ఎన్ని భవనాలు ప్రభావితం అవుతాయి, నష్ట పరిహారాలు ఎంత అవుతాయో తదితర వివరాలను నగరపాలక సంస్థ నుంచి సర్వే చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో రైల్వే, నగరపాలక సంస్థ అధికారులతో నగరంలోని రైల్వే క్రాసింగ్ పాయింట్స్ వద్ద ఆర్‌యూబీల నిర్మాణంపై తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో శ్యామలా నగర్, నెహ్రూ నగర్, సీతానగర్, సంజీవయ్య నగర్, గడ్డిపాడు ప్రాంతాల్లోని రైల్వే క్రాసింగ్ పాయింట్స్ వద్ద ఆర్ఓబీ/ఆర్‌యూబీల నిర్మాణ ప్రతిపాదనలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని, సదరు ప్రాంతాల్లో ఆర్ఓబీ/ఆర్‌యూబీల నిర్మాణం వలన ఎన్ని భవనాలు ప్రభావితం అవుతాయి, వాటికి నష్ట పరిహారాలు ఎంత అవుతుందో రెండు రోజుల్లో నివేదిక ఇవ్వాలని సిటీ ప్లానర్, ఎస్ఈని ఆదేశించారు. నివేదిక మేరకు రైల్వే అధికారులు, జీఎంసీ అధికారులతో సమన్వయంతో తుది నివేదికను రైల్వే బోర్డ్‌కి పంపడం వలన నిర్మాణ అనుమతులు వస్తాయని తెలిపారు. సమావేశంలో రైల్వే డెప్యూటీ సీఈ నోయల్, కన్సల్టెంట్ హనుమరెడ్డి, జీఎంసీ ఎస్ఈ (ఎఫ్ఏసి) సుందరరామి రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి

డ్రెయిన్లలో పూడిక తీయించాలి

నెహ్రూనగర్: నగరంలోని అంతర్గత డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపట్టాలని నగరపాలక సంస్థ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కమిటీ సభ్యులు ఇంజినీరింగ్ అధికారులను కోరారు. మంగళవారం కమిటీ సభ్యులు మెడికల్ క్లబ్, చుట్టగుంట, లాల్ పురం రోడ్ కల్వర్ట్, ఏటుకూరు రోడ్ కమ్మ శేషయ్య గ్రౌండ్, సత్యసాయి స్కూల్, జాతీయ రహదారి కల్వర్టర్లు, పొన్నూరు రోడ్, శారదా కోల్డ్ స్టోరేజ్ వెనుక, అగతరప్పాడు, రెడ్డిపాలెం, కాకాని రోడ్ ఉదయ్ హాస్పిటల్, ఓల్డ్ క్లబ్ రోడ్, వేళాంగిణి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన డ్రెయిన్లలో పూడిక తీత పనులు చేపట్టడం వలన ప్రస్తుత తుఫాన్ వలన ఎక్కువ ప్రాంతాలు ముంపునకు గురి కాలేదని అభిప్రాయపడ్డారు. వెంటనే ఇంజినీరింగ్ అధికారులు స్పందించి పూడిక తీత పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ(ఎఫ్.ఏ.సి.)సుందరరామిరెడ్డి, కొండారెడ్డి పాల్గొన్నారు.